క్లుప్తంగా

సిటీ ప్లానర్ బదిలీ

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలకసంస్థ సిటీ ప్లానర్ జే.సూరజ్‌కుమార్ కడప నగరపాలకసంస్థ సిటీ ప్లానర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళగిరి డైరెక్టర్ ఆఫ్ టౌన్, కంట్రీ ప్లానింగ్ అధికారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాల్సి ఉంది. అలాగే విజయవాడ నగరపాలకసంస్థలో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న వైబీఆర్ చంద్రబోస్‌ను రాజమహేంద్రవరం కార్పొరేషన్ డిప్యూటీ సిటీప్లానర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్‌ఐ సీత కుటుంబానికి సాయం



రూ.లక్ష సాయం అందిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్

కంబాలచెరువు: ధవళేశ్వరం ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్.సీత కుటుంబానికి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ సోమవారం పోలీసు కార్యాలయంలో రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఆదరణ కింద ఆమెకు అందాల్సిన సొమ్మును చెక్కురూపంలో సీత భర్త వెంకటరావుకు అందజేశారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎం కన్నుమూత



వేణుగోపాలరావు

కంబాలచెరువు: డీఎంహెచ్ స్కూలు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ముఖ్య కార్యకర్త యరమాటి వేణుగోపాలరావు (62) ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన రాజమహేంద్రవరంలో అందరికీ సుపరిచితులు. ఆయన మృతికి ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షులు వఝల అప్పయ్య శాస్త్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పింగళి శ్రీనివాస్, నగర శాఖ అధ్యక్షులు డేవిడ్ లివింగ్ స్టన్ తదితరులు సంతాపం తెలిపారు.

నగదు, సెల్‌ఫోన్లు మాయం

కంబాలచెరువు: స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని ఓ ఇంటిలో నగదు, సెల్‌ఫోన్లు అపహరణకు గురైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఈనెల మూడో తేదీన ఇంటి డాబాపై కిలారు బాషా, అతని కుటుంబ సభ్యులు పడుకున్నారు. తిరిగి మర్నాడు ఉదయం లేచి కిందకు వెళ్లి చూసేసరికి షర్టులోని రూ.25 వేలు మాయమయ్యాయి. నాలుగు సెల్‌ఫోన్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై ఫిర్యాదు

కంబాలచెరువు: తిలక్ రోడ్డుకు చెందిన శ్రీనివాసరావు 2021 ఫిబ్రవరిలో నల్లమందు వీధిలో మురమళ్ల శేఖర్ అనే వ్యక్తి వస్తువులు చేయడానికి బంగారం ఇచ్చాడు. సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన బంగారాన్ని తిరిగి ఇవ్వడం లేదు. దీనిపై అడుగుతుంటే తప్పించుకుని తిరిగుతున్నాడు. ఈ మేరకు బాధితుడు సోమవారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


కలెక్టర్‌ను కలిసిన ట్రాఫిక్ డీఎస్పీ



కలెక్టర్ మాధవీలతను కలిసిన ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

సీటీఆర్ఐ: ట్రాఫిక్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటేశ్వర్లు సోమంవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన విజయనగరం దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు.

చరిత్రపై బీజేపీ దాడి తీవ్రతరం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రకాశం నగర్: చరిత్రపై దాడిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రతరం చేసిందని, దానిలో భాగంగానే ఆర్ఎస్ఎస్ భావజాల ప్రతికూల పాఠ్యాంశాలను తొలగిస్తోందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. రాజమహేంద్రి ఆలోచన వేదిక, యూటీఎఫ్, జేవీవీ వంటి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఆనం రోటరీ హాలులో పాఠ్యాంశాల తొలగింపు, పూర్వాపరాలు, పర్యవసానాలు అనే అంశంపై యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ అధ్యక్షత సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన విభజించు-పాలించు అనే నినాదాన్ని బీజేపీ ప్రభుత్వం పాటిస్తోందన్నారు. ఎల్ఐసీ యూనియన్ నాయకులు సతీష్, పీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో పుస్తక పంపిణీ కేంద్రం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ తదితరులు

కంబాలచెరువు: జిల్లా గ్రంథాలయసంస్థ సహకారంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో సోమవారం పుస్తక పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ మాట్లాడుతూ పుస్తకాలు చదవటం వల్ల ప్రతి వ్యక్తిలోనూ మానసిక వికాసం, ఉన్నత వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలను కారాగారములోని ముద్దాయిలతో చదివించి, వారిని పరివర్తన చెందిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకన్న బాబు మాట్లాడుతూ సెంట్రల్ జైలులో ఈ గ్రంథాలయం ప్రారంభించటం గర్వకారణంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ మెంబర్ జీను మహేష్ బాబు మాట్లాడుతూ ఖైదీలు ఈ పుస్తకాలను చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వీఎల్ఎన్ సాయివర ప్రసాద్, సీతంపేట శాఖ గ్రంథాలయ ఉద్యోగులు సుగుణ కుమారి, డొక్కా రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు టి.జయకృష్ణ, కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజకుమార్, బి.రత్నరాజు, జైలర్ కె.దుర్గారమేష్, డిప్యూటీ జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత హిందూధర్మ ప్రచారం

కడియం: మండలంలోని వెంకాయమ్మపేట గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక – రాజమండ్రి కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు.

● పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కడియం: కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1964–1968 మధ్య చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వీరందరూ కడియపులంకలోని అంబికా నర్సరీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, ఆప్యాయంగా పలకరించుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. నాటి ఎస్పీఎల్ స్వామినాయుడు చేసిన సందడి, తుమ్మెద సూర్యనారాయణరాజు చేసిన మిమిక్రీ అలరించింది.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఏడు అర్జీలను స్వీకరించారు. డివిజినల్ పంచాయతీ అధికారి జే.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

అత్యంత ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం 1902కి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి అన్నారు. సోమవారం నగర పాలక సంస్థలో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 16 అర్జీలు స్వీకరించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో పాల్గొన్న అదనపు కమిషనర్ సత్యవేణి

పాఠశాలలకు విద్యాకానుక

- స్టాక్ పాయింట్ నుంచి సరఫరా
- స్కూళ్ల ప్రారంభం రోజునే అందించేందుకు చర్యలు



స్టాక్ పాయింట్ నుంచి స్కూళ్లకు తరలుతున్న విద్యాకానుక

కంబాలచెరువు: వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. దానికంటే ముందుగానే జేవీకే కిట్‌లు ఆయా పాఠశాలలకు చేరనున్నాయి. స్కూల్ తెరిచిన రోజునే వాటిని విద్యార్థులకు అందజేయనున్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఆ పనులు శరవేగంగా సాగుతున్నాయి. విద్యాశాఖాధికారులు యుద్ధప్రాతిపదికన జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు అందించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు.

పర్యవేక్షణ

పాఠశాలలు ప్రారంభమయ్యే ఈనెల 12వ తేదీన జేవీకే కిట్లు పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 85 స్కూళ్లకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు సుమారు 17,232 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ జేవీకే కిట్‌లను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం నగరంలో 19 స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యా కానుక అయిన బ్యాగ్, యూనిఫాం, టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, షూస్, సాక్స్, బెల్ట్, టైలను స్టాక్ పాయింట్ వద్ద విద్యాశాఖాధికారులు, స్కూలు హెచ్ఎంల పర్యవేక్షణలో జేవీకే కిట్‌గా తయారుచేస్తున్నారు.

పాఠశాలలకు పంపిణీ

కిట్ల తయారీలో ఎటువంటి లోటుపాట్లు, సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఎంఈఓ ఆధ్వర్యంలో నాణ్యతా పరిశీలన కమిటీ పర్యవేక్షిస్తోంది. పాఠ్యపుస్తకాల్లో ఎక్కడైనా ముద్రణా లోపం ఉన్నా, లోపల పేజీలు చిరిగిపోయినా వాటిని ముందుగానే వేరు చేయాలని స్టాక్ పాయింట్ వద్ద పనిచేస్తున్న వారికి సూచించారు. దాదాపు ఈ ప్రక్రియ పూర్తయినట్టే. నగరంలోని ఆయా స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను బట్టి స్టాళ్ల నుంచి విద్యాశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యాన్‌లో విద్యాలయాల వద్దకు పంపిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి



స్కూలు ప్రారంభం రోజైన ఈనెల 12న విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేస్తున్న జేవీకే కిట్ల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన కిట్లనే విద్యార్థికి అందేలా ఏర్పాట్లు చేశాం. మాతో పాటు విద్యాధికారులు స్టాక్ పాయింట్‌ను సందర్శించి, పరిశీలిస్తున్నారు. – బి.దిలీప్‌కుమార్, డీఐ, అర్బన్ రేంజ్, రాజమహేంద్రవరం

పల్ల వెంకన్న ట్రస్ట్ సేవలు అభినందనీయం



పల్ల వెంకన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కడియపులంక పూల మార్కెట్ సెంటర్లో సోమవారం వన మహర్షి పల్ల వెంకన్న 87వ జయంత్యుత్సవం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పల్ల సత్యనారాయణ మూర్తి, ఇండియన్ నర్సరీమెన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం, గణపతి సోదరుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చందన నాగేశ్వర్ చేతుల మీదుగా నగదు పారితోషకాలు అందించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీ రంగంలో దేశవ్యాప్త కీర్తి గడించిన పల్ల వెంకన్న చిరస్మరణీయులన్నారు. అంతకు ముందు పల్ల వెంకన్న కాంస్య విగ్రహానికి చందనతో పాటు నర్సరీ రైతులు గజమాలలను అలంకరించి నివాళులు అర్పించారు . అనంతరం కడియం మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాల కిట్లను అందించారు. అలానే ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి, ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకాన్ని అందించారు. కార్యక్రమంలో కడియం నర్సరీమెన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పుల్లా ఆంజనేయులు, నర్సరీ రైతులు తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, వారా రాము సొసైటీ బ్యాంక్ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివా సు , న్యాయవాది తోరాటి వసంత రావు, మార్గాని సత్యనారాయణ, పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాతంశెట్టి శ్రీనివాస చక్రవర్తి, పల్ల వెంకటేష్, వినయ్, ఎంఈఓ లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు కోడెల్లి ప్రకాష్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో డ్వామా కార్యాలయంలో పరిపాలనాధికారి జె.సూర్యనారాయణకు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, నరేష్, కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



చెక్కులు అందజేస్తున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

రాజమహేంద్రవరం సిటీ: చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం నిరంతరం సిద్ధంగా ఉందని స్టేట్ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులోని చేనేత సహకార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29 మంది బాధిత కుటుంబాలకు చెందిన నామినీలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ చేనేత రంగంలో పనిచేస్తూ మరణించిన కార్మికులకు బీమాతో పాటు అదనంగా రూ.12,500 చొప్పున జిల్లాకు చెందిన 29 మంది కుటుంబాలకు పరిహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ డి.సత్యనారాయణ, ఎం.వీ ర్రాజు, ఆప్కో డీఎం కె.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌రామ్‌కు చందన నాగేశ్వర్ కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ నియోజకవర్గానికి ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రెండు మంచి నీటి టాంకర్లు మంజూరు చేసిన రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేసి అభినందనలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- హరిత నగరంగా రాజమహేంద్రవరం
- ఎంపీ భరత్‌రామ్



పుష్కరఘాట్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్



మొక్కనాటి నీరు పోస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ దానిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) సెంటర్ల వద్ద యాచకులకు, చిన్నారులకు వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ జగనన్న హరిత నగరంలో భాగంగా గ్రీన్ సిటీగా రాజమహేంద్రవరాన్ని తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. వర్షాకాలం ఆరంభంలో సుమారు 20 వేల 12 నుంచి 20 అడుగులు ఎత్తున ఉండే చెట్లను తీసుకొచ్చి మహా వృక్షాలుగా పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కాబోతుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, సిటీ యూత్ అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

రుడా ఆధ్వర్యంలో..

పర్యావరణ పరిరక్షణకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నిరంతర కృషి చేస్తోందని చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజమహేంద్రవరంలో రుడా నిధులతో పర్యావరణాన్ని రక్షించే విధంగా రుడా ప్లాంథెర్ పాట్స్‌ను ఏర్పాటు చేయించి అందులో మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరులో ఆయన పార్టీ ముఖ్యనాయకులు, వలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణవాయువును అందించే మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

- కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ రవికుమార్, డాబర్ ఇండియా లిమిటెడ్ సైంటిస్ట్ రామ్మోహన్, విద్యార్థులు మొక్కలు నాటారు.
- శాటిలైట్‌సిటీ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రూరల్ మండల కమిటీ కన్వీనర్ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. రూరల్ కార్యదర్శి ఆకాశం గౌరీశ్‌బాబు, సచివాలయ కార్యదర్శి బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- కొంతమూరులోని రాయుడుపాకలు మందుల కాలనీలో లయన్స్‌క్లబ్ సంఘమిత్ర, హరిత దళం స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వంద మొక్కలు నాటారు. సెక్రటరీ యార్లగడ్డ చిట్టిబాబు, హరితదళం సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

కడియం: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాజమహేంద్రవరం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి బాసిన పద్మ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వేమగిరి గ్రామంలోని దివ్యాంగుల ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు, పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి పద్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నార, గుడ్డ సంచులనే వాడాలని అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. డీఎల్ఎస్ఏ ప్యానల్ న్యాయవాది ధర్నాలకోట వెంకటేశ్వరరావు నల్సా స్కీములను వివరించగా, మరొక పానల్ న్యాయవాది విత్తనాల సుజాత పర్యావరణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ పీఎల్వీలు పి.ప్రశాంతి, ఈ.రాధాకుమారి, పి.బాబూరావు, వికలాంగుల హక్కుల సాధనా సమితి స్టేట్ జనరల్ సెక్రటరీ యనమదల వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త పోలుమాటి రాంబాబు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో..

కంబాలచెరువు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు గంధం సునీత సోమవారం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

అందరి బాధ్యత

సీటీఆర్ఐ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రముఖ మానసిక నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక వెంకటేశ్వర నగర్‌లో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని విశేషంగా సంరక్షిస్తున్న సుధాకర్ పట్నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గోలి రామారావు, క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణం, వాకర్ జిల్లా గవర్నర్ భాస్కరరావు పాల్గొన్నారు.

కాటన్ సంచుల పంపిణీ

రాజానగరం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని స్వగృహం వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ సంచులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజాన్ని ప్లాస్టిక్ రహితంగా తయారు చేయడంలో కూడా అందరూ భాగస్వాములు కావాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంతో పాటు వాతావరణంలో భూతాపాన్ని తగ్గించే విధంగా మొక్కలు నాటడం, రక్తదానం, అవయవ దానం వంటి కార్యక్రమాలపై ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లంక సత్యనారాయణ, సభ్యులు నరసింహ రెడ్డి, వైఎల్ ఆకాశం పాల్గొన్నారు.



కాతేరులో మొక్కను నాటుతున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



కాటన్ సంచులు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి



వేమగిరిలో మొక్కలు నాటుతున్న రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి పద్మ